సాక్షి వైఎస్సార్ జిల్లా

శనివారం, 26, ఏప్రిల్, 2025



టీచర్ల సర్టిఫికెట్లలో 'వైకల్యం'!

ఉపాధ్యాయుల బదిలీలకు వికలత్వం సర్టిఫికెట్ల పరిశీలనలో కొందరు అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు. సర్టిఫికెట్ల మంజూరులో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. -10లో



బాలుడి ప్రాణం తీసిన 'స్విమ్మింగ్ పూల్'

కడప నగర శివారులోని ఓ స్విమ్మింగ్ పూల్‌లో ఒక బాలుడు మృత్యువాత పడ్డాడు. ట్రైనర్ లేకుండానే ఈత కొట్టడంతో ఊపిరి వదిలాడని స్థానికులు తెలిపారు. -10లో

గరిష్ఠం/కనిష్ఠం
42.4/28.0

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 28.0 - 42.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ జోన్ -4 పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు పూర్వపు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్(గవర్నమెంట్) నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టులకు(గవర్నమెంట్) సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్ https://rjdsekadapa.blogpot.comలో ఉంచినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శామ్యూల్ తెలిపారు. కావున ఉపాధ్యాయులు ఈ జాబితాను పరిశీలించాలని ఆయన పేర్కొన్నారు. దీనిని జిల్లా విద్యాశాఖ అధికారులు వారి వెబ్‌సైట్‌లో ప్రకటించాలని సూచించారు.

వేసవిలో తరగతులు నిర్వహిస్తే చర్యలు

కడప ఎడ్యుకేషన్: వేసవిలో జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో తరగతులు నిర్వహించరాదని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో విద్యార్థుల ఆరోగ్యం కోసం ఏప్రిల్ 24 నుంచి జూన్ 12వ తేదీ వరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. అయినా కూడా కొన్ని విద్యా సంస్థలు నిబంధనలు ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

26 నుంచి పోటీలు

మదనపల్లె సిటీ: మదనపల్లెలో 26 నుంచి 27 వరకు 8వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ -బాల, బాలికల షూటింగ్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని రాయలసీమ జిల్లాల షూటింగ్ బాల్ అసోసియేషన్ కన్వీనర్ నరేష్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎస్.హిదాయతుల్లా, కార్యదర్శిగా ఎన్.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా షేక్ నిసార్‌బాష, స్టేట్ గ్రీవెన్స్‌సెల్ ప్రధాన కార్యదర్శిగా పి.శివకుమార్ రెడ్డి, కార్యదర్శిగా డి.రవిప్రకాశ్, సంయుక్త కార్యదర్శిగా డి.ఫయాజ్‌బాషాను నియమించారు.

రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా భాస్కర్‌రెడ్డి



బ్రహ్మంగారిమఠం: మండలంలోని డి.నేలటూరు పంచాయతీ మలుగుడుపాడు గ్రామానికి చెందిన అంబవరపు భాస్కర్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఆ పార్టీ నియమించింది. పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

భళా.. బాలిక



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయం నెరవేరుతోంది. ఏ ఆధారం లేని బాలికల చదువు కోసం.. ఆయన సీఎంగా ఉన్నప్పుడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ) నెలకొల్పారు. వైఎస్సార్ తనయుడు మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కేజీబీవీలకు కార్పొరేట్ హంగులు సమకూర్చారు. వాటిలో ఇంటర్ విద్యను ప్రవేశ పెట్టారు. ఆ విద్యాలయాలు నేడు ఫలితాల పరంగా సత్తా చాటుతున్నాయి. ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో తిరుగులేని ఆధిపత్యం చూపి భళా అనిపించాయి.

- పదో తరగతి ఫలితాల్లో మెరిసిన కేజీబీవీలు
- మొత్తం 85.99 శాతం ఉత్తీర్ణత
- మూడు విద్యాలయాలు వంద శాతం
- ప్రథమ స్థానం విద్యార్థినికి 578 మార్కులు



చాపాడు కేజీబీవీలో స్టడీ అవర్‌లో చదువుకుంటున్న విద్యార్థినులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఫలితాల పరంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) బాలికలు మెరిశారు. జిల్లా వ్యాప్తంగా 17 కేజీబీవీలు ఉండగా వాటిల్లో నుంచి 621 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. వారిలో 534 మంది పాసై 85.99 శాతం ఉత్తీర్ణత సాధించారు. మూడు కేజీబీవీలు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. పెండ్లిమర్రి కేజీబీవీ మినహా మిగతా అన్ని కేజీబీవీల్లో 500 పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఉన్నారు.

నెరవేరుతున్న వైఎస్సార్ కల

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయం నెరవేరుతోంది. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన, ఆర్థిక స్థోమత లేకుండా, పేదరికంలో ఉండి చదవాలనే ఆసక్తి ఉన్నా.. పరిస్థితులు అనుకూలించని ఎంతో మంది నిరుపేద బాలికలు చదువుకోవాలనే లక్ష్యం ఫలిస్తోంది. నేడు ఎంతో మంది విద్యార్థులు బాగా చదివి.. విద్యావంతులై తమ ప్రతిభ చాటుతూ భళా అనిపిస్తున్నారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు ఏర్పాటు చేశారు. వాటిలో ఆహ్లాదకరమైన వాతావరణం, ఇంగ్లిషు మీడియంలో బోధన, అత్యంత భద్రతతో కూడిన సవతి సదుపాయాలు కలిగి.. బాలికలు విద్యావంతులుగా తయారవుతున్నారు. ఈ విద్యాలయాల్లో సాధారణ విద్యతోపాటు ఆంగ్లమాధ్యమం, యోగా, క్రీడలు, వృత్తి విద్యాకోర్సుల ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇవి బాలికలకు చదువుతోపాటు బతుకు దెరువుకు భరోసా కల్పిస్తున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నాడు- నేడు మనబడి కార్యక్రమం ద్వారా కేజీబీవీలకు లక్షలు ఖర్చు చేసి మరిన్ని వసతులు, సౌకర్యాలు కల్పించారు. పదో తరగతి తరువాత వారు డ్రాపౌట్స్‌గా మారేందుకు వీలులేకుండా కేవీజీబీలలో ఇంటర్ విద్యను కూడా ప్రవేశ పెట్టి మరో అడుగు ముందుకు వేశారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించిన కేజీబీవీలు ఇవే..

జిల్లాలో మూడు కేజీబీవీలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. దువ్వూరు కేజీబీవీలో 39 మందికి 39 మంది పాస్ అయి వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. అలాగే సింహాద్రిపురం కేజీబీవీలో 39 మందికి 39 మంది పాస్ అయ్యారు. మైదుకూరు కేజీబీవీలో 37 మందికి 37 మంది ఉత్తీర్ణత పొందారు. గతేడాది 10 కేజీబీవీలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. అలాంటిది ఈ ఏడాది మూడు మాత్రమే సాధించడం గమనార్హం.

90 శాతం పైన ఉత్తీర్ణత

జిల్లాలోని అట్లూరు కేజీబీవీలో 38 మందికి 37 మంది పాసై 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. జమ్మలమడుగు కేజీబీవీలో 39 మందికి 37 మంది పాసై 92 శాతం, వేముల కేజీబీవీలో 38 మందికి 35 మంది పాసై 92 శాతం ఉత్తీర్ణత పొందారు.

80 శాతం పైన ఉత్తీర్ణత

చాపాడు కేజీబీవీలో 36 మందికి 32 మంది పాసై 89 శాతం ఉత్తీర్ణత, పెండ్లిమర్రి కేజీబీవీలో 31 మందికి 27 మంది పాసై 87 శాతం ఉత్తీర్ణత, పెద్దముడియం కేజీబీవీలో 38 మందికి 33 మంది పాసై 86 శాతం, బి.కోడూరు కేజీబీవీలో 32 మందికి 27 మంది పాసై 84 శాతం, ఖాజీపేట కేజీబీవీ 35 మందికి 28 మంది పాసై 80 శాతం ఉత్తీర్ణత సాధించారు.

కేజీబీవీలలో టాపర్స్ వీరే..



గురుధరణి (578 మార్కులు)



నిహారిక (576 మార్కులు)



రిషిత (571 మార్కులు)

దువ్వూరు కేజీబీవీకి చెందిన గురుధరణి 578 మార్కులు సాధించి కేజీబీవీల్లో ప్రథమ స్థానం(టాపర్‌గా)లో నిలిచింది. మైదుకూరు కేజీబీవీకి చెందిన నిహారిక 576 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, సింహాద్రిపురం కేజీబీవీలో రిషిత 571 మార్కులు సాధించి తృతీయ స్థానం సాధించారు.

కేజీబీవీల వారిగా టాపర్స్ వివరాలు


అట్లూరు కేజీబీవీలో స్పందన అనే విద్యార్థి 516 మార్కులు సాధించి ఆ కేజీబీవీ టాపర్‌గా నిలిచింది. చక్రాయపేటలో వి.వర్షిణి 529, పెండ్లిమర్రిలో దీక్షితారెడ్డి 493, వల్లూరులో ఫణివీణ 553, వేములలో సాత్విక 562, బి.కోడూరులో బాను మాధురి 537, కాశినాయనలో హుస్సేన్ బీ 515, చాపాడులో దివ్య కుశాయమ్మ 531, జమ్ములమడుగులో వందన 576, పెద్దముడియంలో సుప్రియ 563, కలసపాడులో మధులత 511, ఖాజీపేటలో భారతి 547, బి.మఠంలో వెంకట సుమశ్రీ 522 మార్కులు సాధించి ఆయా కేజీబీవీల్లో టాపర్స్‌గా నిలిచారు.

నిత్యం పర్యవేక్షిస్తూ..



జిల్లాలోని ఆర్‌జేడీ, డీఈఓల సూచనలు, సలహాలు పాటిస్తూ కేజీబీవీలను నిత్య పర్యవేక్షించాం. నిత్యం స్టడీ అవర్స్‌తో పాటు వారాంతం పరీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు మార్కుల పరంగా పర్యవేక్షిస్తూ వచ్చాం. తక్కువ మార్కులు వచ్చే వారి పట్ల ఎస్‌ఓలతో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. దీంతో ఉత్తమ ఫలితాలు సాధించాం. - అనిత, జీసీడీఓ, సమగ్రశిక్ష

సంతృప్తికర ఫలితాలు



కేజీబీవీల ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయి. కేజీబీవీల ఫలితాల పరంగా 85.99 శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు 17 కేజీబీవీలకు గాను మూడు కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించాం. చాలా మంది విద్యార్థినులు 500 మార్కులుపైన సాధించారు. ఫలితాల పరంగా సంతోషంగా ఉంది.

- షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

లోక్‌అదాలత్ వాయిదా

కడప అర్బన్: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా 'జాతీయ లోక్ అదాలత్' షెడ్యూల్ ప్రకారం మే 10న (రెండవ శనివారం) జరగాల్సి ఉండగా.. జూలై 5 (మొదటి శనివారం)వ తేదీకి వాయిదా పడింది. ఈ సమాచారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, ఎస్.బాబా ఫక్రుద్దీన్ శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని కక్షిదారులు, వివిధ శాఖల అధికారులు గమనించాలని వారు కోరారు.

నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సి.శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్: వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి కొరత రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చే ఏర్పాట్ల సన్నద్ధతపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రెండు నెలలు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి కొరత రాకుండా ప్రత్యేక, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా కడప నగరానికి మైలవరం ప్రాజెక్టు ద్వారా ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద నీటిని నిల్వ చేసి పొదుపుగా వాడుకునే చర్యలు చేపట్టాలన్నారు. మే నెల నాటికి పులివెందుల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందేలా పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసేలా దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రాజెక్టుల ఇంజినీరింగ్ అధికారులు, ఏపీఎస్పీడీసీఎల్, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉగ్రదాడిపై నిరసన జ్వాల

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం దుర్ఘటనపై నిరసన జ్వాల రగులుకుంది. కడపలో శుక్రవారం భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. హిందూ సంఘాల జేఏసీ ప్రతినిధులతోపాటు పలు దేవాలయాల కమిటీ సభ్యులు, కళాశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు సైతం ఉత్సాహంగా పాలుపంచుకోవడం విశేషం. త్రివర్ణ, కాషాయ పతాకాలు చేతబూని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి.. కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. భారతీయుల శాంతిని పరీక్షిస్తే.. ఇక ఉపేక్షించబోమని వారు ముక్తకంఠంతో హెచ్చరించారు.

- కడప కల్చరల్



సేల్ రిజిస్ట్రేషన్లకు నిబంధనాలు

'పరిశ్రమలు పెట్టేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రండి.. కొనుగోలు చేసే భూముల్లో రాయితీలు ఇస్తాం.. పరిశ్రమలు పెట్టిన తర్వాత ప్రోత్సాహకాలు అందిస్తాం.. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటే వడ్డీ రాయితీ కల్పిస్తాం' అని ఊదరగొట్టి, కల్లబొల్లి మాటలు చెప్పే ప్రభుత్వాలు.. పరిశ్రమలు పెట్టిన వారిని ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాయి. ఇటు ఏపీఐఐసీ, అటు పరిశ్రమల శాఖ అధికారుల వైఖరి వల్ల పారిశ్రామికవేత్తలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

- అడ్డుగా మారిన ఏపీఐఐసీ నిబంధనలు
- సేల్ అగ్రిమెంట్‌లో లేకపోయినా పీఎఫ్, ఈఎస్‌ఐ కోసం పట్టు
- కార్యాలయం చుట్టూ పారిశ్రామికవేత్తల ప్రదక్షిణలు
- నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు.. ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఎంఎస్‌ఎంఈ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన అసోషియేషన్ల ప్రతినిధులు
- మంత్రి నుంచి కరువైన స్పష్టమైన హామీ



కడపలోని పరిశ్రమల శాఖ కార్యాలయం

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసిన, చేయాలని ఆసక్తి ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) నిబంధనలు ముందరి కాళ్లకు బంధం వేస్తున్నాయి. ఏపీఐఐసీ వివిధ చోట్ల ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి నిర్ణీత ధరకు ప్లాట్లు విక్రయిస్తుంది. కడపలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్, కొప్పర్తి పారిశ్రామికవాడలో ఫేజ్-1, ఎంఎస్‌ఈ-సీడీపీ, మైదుకూరు, ప్రొద్దుటూరు, రాజంపేట, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయి. ప్లాట్లు కేటాయించే క్రమంలో సేల్ అగ్రిమెంట్ చేసిన ఏపీఐఐసీ అధికారులు.. పరిశ్రమలు నెలకొల్పిన తర్వాత సేల్ డీడ్ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లిస్తేనే సేల్ రిజిస్ట్రేషన్ చేస్తామని సేల్ అగ్రిమెంట్‌లో ఎక్కడా లేకపోయినా.. ఏపీఐఐసీ అధికారులు కావాలనే మొండికేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో ఒక్కటంటే ఒక్కటి కూడా.. సేల్ డీడ్ కాలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.


నిబంధనలన్నీ పారిశ్రామికవేత్తలకేనా.. ఏపీఐఐసీకి వర్తించవా?

నీరు, కరెంటు, రోడ్లు, కాలువలు వంటి వసతులు కల్పించకుండానే ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్న ఏపీఐఐసీ అధికారులు.. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పరిశ్రమలు స్థాపిస్తున్న వారిపై కఠిన వైఖరి అవలంబిస్తున్నట్లు విమర్శలున్నాయి. అన్ని రకాల అనుమతులు పొంది పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని.. 'అయ్యా మాకు సేల్ డీడ్ చేసివ్వండి' అని కోరుతున్న వారికి అధికారులు పగలే చుక్కలు చూపిస్తున్నారు. వారికి ఎక్కడ లేని నిబంధనలు పెడుతూ నెలల తరబడి సేల్‌డీడ్ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. 'మీరు మొదట డీపీఆర్‌లో ఎంత మందికి ఎంప్లాయిమెంట్ కల్పిస్తామన్నారు.. వారందరికీ కల్పించారా.. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ చేశారా.. ఫ్యాక్టరీ లైసెన్స్ తీసుకున్నారా.. మీకు ఇచ్చిన భూమిలో 90 శాతం భూమిని వినియోగించారా(అందుకు తగిన ధ్రువీకరణ పత్రం సమర్పించాలి).. ఇది లేదు, అదిలేదు.. అంటూ నానా కొర్రీలు వేస్తూ సేల్ డీడ్ చేయకుండా నెలలు, సంవత్సరాలు జాప్యం చేస్తున్నట్లు సమాచారం. అమ్యామ్యాల కోసమే వీరు ఇదంతా చేస్తున్నారని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు.

ఫ్యాక్టరీస్ యాక్టు పరిధిలోకి రాకపోయినా..

20 కంటే తక్కువ మంది కార్మికులు పని చేస్తున్న పరిశ్రమలు, 30 హెచ్‌పీ కంటే తక్కువ కరెంటు వినియోగిస్తున్న సూక్ష్మ, చిన్న పరిశ్రమలు ఫ్యాక్టరీస్ యాక్టు పరిధిలోకి రావు. వీరి వద్ద పర్మినెంట్ కార్మికులెవరూ పని చేసే అవకాశం ఉండదు. రోజు వారీ కూలీలు మాత్రమే పని చేస్తుంటారు.. వాళ్లలో కొంత మంది ఒక రోజు వస్తే మరొక రోజు రారు. కొందరు నెల, రెండు నెలలు పని చేసి వెళ్లిపోతుంటారు. వీరికి పీఎఫ్, ఈఎస్‌ఐ కూడా చెల్లించడం కష్టతరంగా మారుతోంది. కానీ ఏపీఐఐసీ అధికారులు మాత్రం ప్రతి ఒక్కరూ ఫ్యాక్టరీ లైసెన్స్ తీసుకోవాలి, కార్మికులకు ఫీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించాలనే నిబంధనలు విధిస్తున్నారు. సేల్ అగ్రిమెంట్‌లో లేకపోయినా అధికారులు ఎందుకు పట్టుబడుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

పాలసీ ఇలా..



మొదట పారిశ్రామికవేత్తలు తాము ఏ పరిశ్రమ పెట్టదలుచుకున్నారో, దాని పేరు, అందుకు సంబంధించిన డీపీఆర్‌తో ఏపీఐఐసీకి దరఖాస్తు చేసుకుంటారు. వారు పెడుతున్న పరిశ్రమకు ఎంత భూమి అవసరమో అధికారులు గుర్తించి అంత భూమిని కేటాయిస్తారు. భూ కేటాయింపు తర్వాత 3 మాసాల్లో పూర్తి మొత్తం చెల్లించి సేల్ అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏపీఐఐసీ భూములను సేల్ డీడ్‌గా కాకుండా లీజు డీడ్ పద్ధతిలో ఇవ్వాలని నిర్ణయించి.. 1/4 మొత్తం చెల్లిస్తే చాలు.. లీజు అగ్రిమెంట్ చేసి.. ఆ తర్వాత 8 ఏళ్లలో వడ్డీతో కలిపి పూర్తి మొత్తం చెల్లించేలా నిర్ణయించారు. 2024లో పారిశ్రామిక వేత్తల విజ్ఞప్తి మేరకు అదే ప్రభుత్వం భూములను లీజు పద్ధతిలో కాకుండా సేల్ పద్ధతిలోనే ఇవ్వాలని పాలసీ ప్రవేశపెట్టారు. భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటి నుంచి రెండు, మూడేళ్లలో పరిశ్రమ ఏర్పాటు చేసి ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉంటుంది. అలా ఏర్పాటు చేయకపోతే ఎందుకు చేయలేదో ఏపీఐఐసీకి రాతమూలకంగా తెలియజేసి (ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైం) పొందాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు పూర్తి మొత్తం చెల్లించి, పరిశ్రమల్లో ఉత్పత్తి ప్రారంభించిన వారికి ఏపీఐఐసీ సేల్ డీడ్ చేయాల్సి ఉంటుంది. తద్వారా ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల ద్వారా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

వారి తప్పులు.. వీరికి శాపాలు

అధిక శాతం పారిశ్రామికవేత్తలు పరిశ్రమల ఏర్పాటుపై వారికి తగిన పరిజ్ఞానం ఉన్నప్పటికీ.. డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) కోసం చార్టెడ్ అకౌంటెంట్లను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడే తప్పులు జరుగుతున్నాయి. అన్ని రకాల యూనిట్లకు పేర్లు, విషయం (సబ్జెక్ట్) మార్చి కాపీ, పేస్ట్ చేయడం వల్ల అన్ని పరిశ్రమలకు కార్మికుల సంఖ్యను గుడ్డిగా నమోదు చేస్తున్న పరిస్థితి ఉంది. ఇది సరిచూసుకోలేని వారు ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. 'డీపీఆర్‌లో మీరు ఇంత మందికి ఎంప్లాయిమెంట్ చూపారు కదా.. వారందరికీ పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించండి' అంటూ ఏపీఐఐసీ అధికారులు మెలిక పెడుతున్నట్లు సమాచారం. దీంతో ఏం చేయాలో తెలియక పారిశ్రామికవేత్తలు తల పట్టుకుంటున్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో ఆటోమేటిక్ మెషీన్లు వచ్చినందున ఎక్కువ మంది కార్మికులతో పెద్దగా అవసరముండదు. సూక్ష్మ, చిన్న స్థాయి పరిశ్రమలకు ఇంత మంది కార్మికులతో ఏం అవసరమని ఆలోచన చేయని అధికారులది కూడా ఇందులో తప్పుంది. ఏ పరిశ్రమలో ఎంత మంది కార్మికులు పని చేస్తున్నారో ఆయా పరిశ్రమల యాజమాన్యాల నుంచి అఫిడవిట్ తీసుకొని సేల్ డీడ్ చేయవచ్చని కొందరు అధికారులు చెబుతున్నారు. దీనిపై ఇటీవల జిల్లా పర్యటనకు విచ్చేసిన ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి పారిశ్రామికవేత్తలు, అసోసియేషన్ల ప్రతినిధులు తీసుకుపోయినట్లు సమాచారం. అయితే దానిపై ఆయన్నుంచి స్పష్టమైన హామీ లభించనప్పటికీ ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతానని చెప్పినట్లు తెలుస్తోంది.

29న ఉద్యాన సమ్మేళనం



కడప అగ్రికల్చర్: కడపలో ఈ నెల 29న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఉద్యాన శాఖ వారు 'జిల్లా ఉద్యాన సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి తెలిపారు. స్థానికంగా ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని నగర పరిధి రాయచోటి రోడ్డులోని మాధవి కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యాన రంగంలోని వివిధ రకాల భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకురావడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇందులో ఉద్యాన రైతులు, ఉద్యాన శాస్త్రవేత్తలు, విత్తన ఉత్పత్తిదారులు, ఎరువుల సరఫరా దారులు, విధాన నిర్ణేతలు, ఇతర సంబంధిత నిపుణులు పాల్గొంటారని చెప్పారు. ముఖ్యంగా ఉద్యాన రంగంలో ఎదుర్కొంటున్న తాజా సవాళ్లు, అవకాశాలపై చర్చించడంతో పాటు ఈ రంగంలో స్థిరమైన వృద్ధిని ప్రోత్సహించడానికి వినూత్న సాంకేతికతలు, ఉత్తమ పద్ధతులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం కూడా లక్ష్యం అన్నారు. వివిధ రకాలైన సెషన్లు ఉంటాయని వీటిలో నిపుణులచే ప్రసంగాలు, చర్చా వేదికలతోపాటు విజయవంతమైన ఉద్యాన పద్ధతుల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. తమ పరిజ్ఞానం, అనుభవాలను పంచుకోవడానికి, ఒకరికొకరు సంబంధాలు ఏర్పరచుకోవడానికి ఇది ఒక ప్రత్యేకమైన అవకాశం అన్నారు. కావున కడప, చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఉద్యాన రైతులతోపాటు ఈ రంగంలో ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

టీచర్ల సర్టిఫికెట్లలో వైకల్యం..!

- మూడు రోజుల పరిశీలనలో 'గోల్‌మాల్'
- డాక్టర్ల క్లినిక్‌లకు వెళ్లి కొందరి బేరసారాలు
- ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.30 వేల వరకు వసూళ్లు
- తొలి రోజున నగదు రూపంలో ఫీజుల వసూలు
- అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే

ఉపాధ్యాయుల బదిలీలకు వికలత్వం సర్టిఫికెట్ల పరిశీలనలో కొందరు రిమ్స్ అధికారులు, వైద్యులు, కొందరి సిబ్బంది అక్రమంగా డబ్బు వసూలు చేస్తూ అవినీతికి పాల్పడ్డారు. వికలత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్ల మంజూరులో అక్రమాలకు పాల్పడుతున్నారు. టీచర్ల బదిలీల కోసం వికలత్వ ధ్రువపత్రం, వ్యాధులు కలిగిన ఉపాధ్యాయులపై ఆధారపడిన కుటుంబసభ్యుల సర్టిఫికెట్ల పున:పరిశీలన విషయంలోనూ వసూళ్లకు పాల్పడుతూ జేబులను నింపుకొంటున్నారు.



సర్టిఫికెట్ పరీక్షలకు వచ్చిన ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది బదిలీల కోసం ఏకంగా చట్టం చేశారు. ఈ విషయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక చట్టాన్ని తీసుకువచ్చారు. దానికనుగుణంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ప్రతి జిల్లాలో ఈ నెల 24వ తేదీ నుంచి 26వతేదీ వరకు మూడు రోజుల పాటు బోధన, బోధనేతర సిబ్బందికి చెవుడు, మూగ, కుంటి, గుడ్డి, అంగ వికలత్వం, బుద్ధి మాంద్యం, క్యాన్సర్, మూత్ర పిండాల వ్యాధి, గుండె జబ్బు, ఇలా వ్యాధులు కలిగిన సిబ్బంది లేదా వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల వివరాలు పునఃపరిశీలించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయా విభాగాల్లో నిష్ణాతులైన డాక్టర్లచే రిమ్స్ జనరల్ హాస్పిటల్‌తో వికలత్వ, వ్యాధి నిర్ధారణ పునఃపరీక్షలు రిమ్స్ సూపరిండెంట్ పర్యవేక్షణలో జరురగుతున్నాయి. వివిధ విభాగాలు డాక్టర్లు, అధికారులను, సిబ్బందిని ఇందుకోసం నియమించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా ఈ నెల 24న జరిగిన పరిశీలనలో చేయి తడపనిదే కొందరు సర్టిఫికెట్లు జారీ చేసేందుకు ముందుకు రాలేదనే విమర్శలున్నాయి. రిమ్స్ సిబ్బంది చేతివాటం ప్రదర్శించి కొందరు డాక్టర్లు, అటు టీచర్లను మేనేజ్ చేశారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. డబ్బులిచ్చిన వారికి కోరుకున్నట్లు సర్టిఫికెట్లు జారీ చేసేశారు. కొందరు యూనియన్ లీడర్లు, మండల విద్యాధికారులతో రెండు రోజుల ముందుగానే సిబ్బంది టచ్‌లోకి వచ్చి సర్టిఫికెట్ల జారీపై చెప్పినట్లు సమాచారం.

ఒక్కో రేటుతో వసూళ్లు

వికలత్వానికి ఒక రేటు, వ్యాధులకు మరో రేటు నిర్ధారించి వసూలు చేసినట్లు సమాచారం. ఆఫీసులో పని చేసే పెద్దస్థాయి అధికారి, సంబంధిత సెక్షన్ అధికారులు, సిబ్బంది ఉపాధ్యాయుల యూనియన్ లీడర్లు, మండల అధికారులతోనూ లాలూచీ పడినట్లు సమాచారం. రిమ్స్ పరిపాలనా విభాగంలో పనిచేసేఆఫీస్ సిబ్బందిలో కొందరు ఈ వ్యవహారాన్ని సాగించారు. ఉపాధ్యాయుల స్థాయిని బట్టి రేటు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలకు తెరతీసిన పరిపాలనా సిబ్బంది పారదర్శకంగా వికలత్వ సర్టిఫికెట్ల పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. బోగస్ వికలత్వ సర్టిఫికెట్లు బోగస్ వ్యాధుల పేరున సర్టిఫికెట్‌ల ధృవీకరణ లేకుండా అధికారులు డాక్టర్లు వ్యవహరించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ఉపాధ్యాయుడు, వారి కుటుంబ సభ్యులచే రిమ్స్ హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ పేరిట నిర్ధారణ పరీక్ష ఫీజు రూ.1000 చెల్లించాలని నిబంధన ఉండగా, ఈ డబ్బు బ్యాంకులో చెల్లించి రసీదు తీసుకువచ్చి వికలత్వ సర్టిఫికెట్‌కు జత చేసి, ఇస్తే డాక్టర్ పరిశీలించాల్సి వుంది. ఈ నిబంధనను తొలి రోజున తుంగలో తొక్కి డబ్బు తామే కట్టించుకున్నారు. కలెక్టర్, రిమ్స్ పరిపాలనాధికారులు ఇప్పటికైనా స్పందించి మిగిలిన రెండు రోజులైనా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. తొలి రోజున 190 మందికి వికలత్వ పున:పరీక్షలు నిర్వహించారు. రిమ్స్ అధికారుల సూచన మేరకు రెండు రోజుల వికలత్వ సర్టిఫికెట్ల నిర్ధారణ పరీక్షల ఫీజు యూనియన్ నాయకులే వసూలు చేసి 'ఆసుపత్రి అభివృద్ధి కమిటీ' ఖాతాలో ఎట్టకేలకు జమచేశారు.

క్లుప్తంగా

పోలీసుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

– జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్

కడప అర్బన్ : పోలీసు శాఖ సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పోలీస్ స్టేషన్లు, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది తమ వ్యక్తిగత, బదిలీలు, స్పౌస్, వైద్య సమస్యలపై ఎస్పీకి విన్నవించారు. వారి సమస్యలను విన్న ఎస్పీ తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా ఇచ్చారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆయన ఆదేశించారు.

ఒడిషా వాసి మృతి

వేముల : రహదారి పనులు చేస్తున్న టిప్పర్ కింద పడి ఒడిషా రాష్ట్రానికి చెందిన రాజునాయక్(56) శుక్రవారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. ఒడిషా రాష్ట్రంలోని గంజామ్ జిల్లాకు చెందిన రాజునాయక్ నెల రోజుల కిందట డీబీఎల్ కంపెనీలో కూలి పనుల్లో చేరాడు. డీబీఎల్ కంపెనీ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో భాగంగా గురువారం రాత్రి టిప్పర్‌తో మట్టిని రోడ్డు పనులకు తరలిస్తున్నారు. ప్రమాదవశాత్తు టిప్పర్ రాజునాయక్‌పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి మృతుడి బావమరిది బజ్యా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప అగ్రికల్చర్ : ఏపీ పశుసంవర్ధ శాఖ ఆధ్వర్యంలో ఊటకూరు కోళ్ల ఫారంలో మూడు ప్రధాన యూనిట్ల అభివృద్ధికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శారదమ్మ తెలిపారు. పబ్లిక్, ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో చేపట్టనున్న ఈ యూనిట్లకు ముందస్తుగా పెట్టుబడి అవసరం లేదని, ప్రభుత్వ మౌలిక వసతులను వాడుకునే అవకాశాన్ని ఇస్తామన్నారు. నిర్వహణ, నాణ్యత, ఉత్పత్తి పెరుగుదల అంశాల్లో నిబంధనలకు కట్టుబడి ఉండాలన్నారు.

రిమ్స్ ఓపీలోక్యాంటీన్ ప్రారంభం



రిమ్స్ ఓపీలో ప్రారంభమైన క్యాంటీన్

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఓపీలో 24 రోజుల తరువాత క్యాంటీన్ గురువారం తిరిగి ప్రారంభించారు. క్యాంటీన్ తెరవ లేదని, ప్రజలు, వైద్యులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారనీ ఇటీవల పత్రికలలో వార్తలు రావడంతో స్పందించిన ఆస్పత్రి అధికారులు క్యాంటీన్‌ను ఒకరికి అప్పగించారు. త్వరలో జరిగే ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశంలో అక్కడ ఏ పద్ధతిలో ఇవ్వాలనేది తీర్మానించనున్నట్లు అధికారులు తెలియజేశారు.

ఆదీ.. స్థాయి మరచి మాట్లాడకు

– ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి, తదితరులు

జమ్మలమడుగు: ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి.. ముందు నీ స్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడు. నీకు రాజకీయ భిక్ష పెట్టిందే వైఎస్‌కుటుంబం. వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై గెలిచిన సంగతి మరచిపోరాదు.. అని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. జమ్మలమడుగు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2014లో వైఎస్సార్‌సీపీ టికెట్‌పై గెలిచి.. దొడ్డిదారిలో టీడీపీలో చేరిన ఆదినారాయణరెడ్డి అక్రమాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కల్వటాల, పాపాయపల్లెలో సోలార్ పనులను అడ్డుకుంటే కేసులు పెట్టించే బెదిరిస్తున్నారన్నారు. నాగిరెడ్డిపల్లెలో 500 ఎకరాల కొండను ఎమ్మెల్యే అండతో అనుమతులు లేకుండా యంత్రాలు పెట్టి పనులు చేస్తున్నారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయాల్లో లేకుండా చేస్తానని ప్రగల్బాలు పలికిన నీ మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సోలార్ కంపెనీకి పీఆర్ హెచ్చరిక

రైతులను బెదిరించి సొమ్ము చేసుకోవాలని చూస్తే సహించమని రామసుబ్బారెడ్డి హెచ్చరించారు. వ్యవసాయం చేసే రైతు దొంగతనం చేశాడంటూ కేసు పెట్టడం చరిత్రలో తొలిసారి అన్నారు. సోలార్ కంపెనీ ప్రతినిధులు అక్రమ కేసులు పెడితే ప్లాంట్ నడుపుకోవడం కష్టం అవుతుందని హెచ్చరించారు.

నమ్మించి... రిమాండ్‌కు తరలించి

మాట్లాడుదామని పిలిచి అరెస్టు చేసిన ఎస్‌ఐ

జమ్మలమడుగు : సమస్య ఉంటే మాట్లాడుదామంటూ రైతును స్టేషన్‌కు పిలిచిన ఎస్‌ఐ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించిన సంఘటన ముడియం మండలంలో శుక్రవారం జరిగింది. పెద్దముడియం మండలం కల్వటాల, కొండ పాపాయపల్లె గ్రామాల్లో సేల్(ఎస్‌ఏఈఎల్) కంపెనీ ఇటీవల సోలార్ నిర్మాణం చేపట్టింది. వీటికి ప్రభుత్వ భూములతోపాటు, డీకేటీ పట్టాలు, పట్టా భూముల్లో రైతులకు సమాచారం ఇవ్వకుండానే కంపెనీ పనులు చేస్తూ వచ్చింది. కొండ కల్వటాలలోని సర్వే నంబర్ 307లో పొరంబోకు భూములను నిరుపేదలు డబ్బు ఖర్చుచేసి బోరు వేసి పంటలు సాగు చేస్తున్నారు. ఈ కోవకు చెందిన రైతు మధుసూదనరెడ్డికి కల్వటాలలో డికేటీ పట్టా ఉంది. తాను పొలం సాగుచేయడానికి మట్టి తోలి.. పెద్ద రాళ్లు తొలగించేందుకు రూ.2 లక్షలు ఖర్చు చేశారు. ఇదిలా ఉంటే సోలార్ కంపెనీ ఉన్నట్లుగా సమాచారం ఇవ్వకుండానే మధుసూదన్‌రెడ్డి బాగుచేసిన భూమిని చదును చేయడం ప్రారంభించింది. ఇదేమిటంటూ కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించారు. ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతూ 'ఆ భూమి సోలార్‌కు ఇచ్చింది.. అడ్డుతగలవద్దు' అంటూ హెచ్చరించారు. తన భూమిలో మీ పెత్తనం ఏమిటంటూ రైతు ప్రతాప్ రెడ్డికి స్పష్టం చేశారు. ఆ తర్వాత కొంత సేపటికే ఎస్‌ఐ సుబ్బారావు ఫోన్ చేసి రైతుతో మాట్లాడారు. ఆ భూమిపై హక్కు ఉన్నట్లు పట్టాలుంటే చూపమంటూ చెప్పారు. లేకపోతే నీ మీద కేసులు పెడుతానంటూ బెదిరించాడు. ఆదే భూమి ఆధారంగా జీవనం సాగించే తనకు సమాచారం లేకుండా ఇలా చేస్తే ఎలా అంటూ ప్రశ్నించాడు. దీంతో తమ వద్ద డబ్బు డిమాండ్ చేశాడంటూ సోలార్ యాజమాన్యం తప్పుడు కేసు నమోదుచేయడం, వెంటనే ఎస్‌ఐ సుబ్బారావు స్టేషన్‌కు పిలిపించి అరెస్టు చేయడం జరిగిపోయింది. అయితే మాట్లాడకుండానే రిమాండ్‌కు పంపడం చూసి ఆ రైతు అవ్వాక్కయ్యాడు.

ధనార్జనే ధ్యేయంగా బాబాయ్, అబ్బాయిల లూటీ

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి
- మాజీ ఎమ్మెల్యే మూలే సుధీర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మూలే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : నియోజకవర్గంలో ధనార్జనే లక్ష్యంగా పరిశ్రమలను లూటీ చేయడానికి బాబాయ్, అబ్బాయిలు ఆరాటపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్పీడ్ ఆఫ్ లూటీకి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెరలేపారని, స్థానికులను మరచి.. స్థానికేతరుడు మదుసూదన్ రెడ్డికి పనులు అప్పగిస్తున్నారన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన ఆదినారాయణరెడ్డి ఆర్టీపీపీలో ఫ్లయాష్ కోసం టీడీపీ నాయకుడు జేసీ ప్రభాకర్‌రెడ్డితో ఘర్షణ పడింది ప్రజలందరికీ తెలుసన్నారు. గెలుపు కోసం ప్రత్యేక విమానంలో వచ్చి ఆదినారాయణరెడ్డికి ఓటువేసిన రమేష్‌నాయుడు తోనూ సోలార్ ప్లాంట్ కాంట్రాక్టు కోసం గొడవపడిన నీచ చరిత్ర ఎమ్మెల్యేదేనని విమర్శించారు. నియోజకవర్గంలో తప్పు మీద తప్పులు చేస్తున్న ఎమ్మెల్యే ఇపుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డిలపై నిందలు వేస్తున్నారన్నారు. కార్యకర్తలను వదిలేసి తన కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూర్చేందుకే ఎమ్మెల్యే పనిచేస్తున్నావన్నారు. సిమెంట్ పరిశ్రమలకు వెళ్లే ముడిసరుకు రవాణా వాహనాలు సీజ్ చేయించడం దారుణం అన్నారు. ఎమ్మెల్యే ధనార్జనకు సిమెంట్ పరిశ్రమలు మూతపడిపోయి పరిస్థితి వస్తోందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బాలయ్య, మేకల భాస్కర్, జయరామకృష్ణారెడ్డి, దాసరి నారాయణరెడ్డి, రషీద్, మహమ్మద్ ఆలీ, వెంకటశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి ప్రాణం తీసిన స్విమ్మింగ్‌పూల్

- ట్రైనర్ లేకుండానే అనుమతులు
- ఎమ్మెల్యే ప్రారంభించారని నోరు మెదపని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడప నగర శివారులోని చలమారెడ్డిపల్లెలో ఈ నెల 24న స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకునేందుకు వెళ్లిన గంజికుంటకాలనీ బాలుడు(15) మృత్యువాత పడ్డాడు. ట్రైనర్ లేకుండానే ఈత కొట్టడంతో బాలుడు ఊపిరి వదిలాడని స్థానికులు తెలిపారు. ఈ స్విమ్మింగ్‌పూల్ కడపకు చెందిన ఓ టీడీపీ నాయకుడు ఎలాంటి నిబంధనలు, అనుమతులు లేకుండానే నిర్మించారు. రెవెన్యూ, కార్పోరేషన్ స్థాయిలో అనుమతులు లేకపోయినా, టీడీపీ నేత కావడంతో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఆర్భాటంగా వచ్చి తన చేతులమీదుగా రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా ప్రారంభించడంతో ఒకవైపు కార్పొరేషన్, మరోవైపు రెవెన్యూ అధికారులు నోరు మెదపలేదు. అయితే ఈత నేర్పించేందుకు నిష్ణాతులైన ట్రైనర్‌ను నియమించకపోవడంతోనే ఓ బాలుడు మృతిచెందారని భావిస్తున్నారు. మరో వైపు బాలుడి తండ్రి దు:ఖానికి అవధుల్లేవు. ఏడాది కిందట ఆయన సతీమణి మృతి చెందారు.

ఇపుడు తనయుడు చనిపోయినా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు, మీడియాకు వివరాలను తెలియజేసేందుకు కూడా మనస్కరించలేదు. బాలుడు ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు(సెంట్రల్ సిలబస్) రాశారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు.

గీతాశ్రమంపై నివేదిక ఇవ్వండి

డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్



ఈఓను అడిగి వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్

సాక్షి ఎఫెక్ట్..

ప్రొద్దుటూరు : గీతాశ్రమంలోని మలయాళ స్వామి బీఈడీ కళాశాల నిర్వహణపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) గురు ప్రసాద్ తెలిపారు. దేవ దేవా.. ఆదాయం స్వాహా, దేవుడి సొమ్మును దోచుకుతింటున్నారు అంటూ ప్రచురితమైన సాక్షి కథనాలకు ఆయన స్పందించారు. శుక్రవారం గీతాశ్రమాన్ని డిప్యూటీ కమిషనర్ సందర్శించి వివరాలు సేకరించారు. మలయాళస్వామి బీఈడీ కళాశాల భవనాలు పరిశీలించారు. ఎందుకు అద్దె చెల్లించడం లేదు? అని కళాశాల ప్రతినిధి సుదర్శన్‌రెడ్డిని ఆరాతీశారు. తమ కళాశాలకు సంబంధించి రూ.18 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లున్నాయని సుదర్శన్ రెడ్డి తెలపగా.. అందులో వాస్తవం లేదని ఈవో అన్నారు. ఆ డబ్బు గంగాధరానందగిరి స్వామి జమ చేశారని, దానితో కళాశాలకు సంబంధం లేదన్నారు. వెంటనే అద్దె చెల్లించకపోవడంపై తగిన ఆధారాలతో సహా నివేదిక సమర్పించాలని ఈఓను ఆదేశించారు. అనంతరం అక్కడికి వచ్చిన కళాశాల చైర్మెన్ సురేష్ బాబురెడ్డి డిప్యూటీ కమిషనర్‌ను కలిశారు.

ఈవోపై చర్యలు తీసుకోవాలి

అక్రమాలకు పాల్పడుతున్న ఈఓ రామచంద్రాచార్యులుపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు గౌరీ శంకర్ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్‌కు విన్నవించారు. కళాశాల భవనాలకు రూ.60 వేల వరకు అద్దె వచ్చే అవకాశం ఉన్నా, రూ.29 వేలకే ఇచ్చారని అన్నారు. గతంలో తొలగించిన ఉద్యోగి జనార్దన్‌రెడ్డిని తిరిగి విధుల్లోకి తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా పాత బకాయిలు రూ.5 లక్షలు చెల్లించారన్నారు. శ్రీకృష్ణ గీతాశ్రమానికి అనధికారికంగా తానే ఈవోనని ఆశ్రమాన్ని నడిపిస్తున్నారని జనసేన ప్రొద్దుటూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్ మాదాసు మురళి డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసుల పరిష్కారంలో అందరి సహకారం అవసరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని

కడప అర్బన్ : కేసుల పరిష్కారం విషయంలో కడప బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదుల సహకారం అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సి.యామిని అన్నారు. కడప కోర్టులో పనిచేసి బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులు జె.నందిని, జె.హేమస్రవంతి, భార్గవిలకు శుక్రవారం వీడ్కోలు సభ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి సి.యామిని మాట్లాడుతూ కేసులు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులు జే.నందిని, జే.హేమ స్రవంతి, భార్గవి మాట్లాడుతూ కడప కోర్టులో పని చేసినంత కాలం త్వరితగతిన కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించారన్నారు. బదిలీపై వెళ్లిన చోట బాధ్యతగా విధులు నిర్వర్తించి కేసు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు ఎ.ఉమాదేవి ప్రధాన కార్యదర్శి చంద్రవదన, సురేష్‌కుమార్, ఎల్. వెంకటేశ్వరరావు, కె. ప్రత్యూష కుమారి, ఎస్.బాబా ఫక్రుద్దీన్, అసోసియేషన్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వైద్య నాథుడి ఉత్సవాలపై మీనమేషాలు

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరిలో బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు వేలాది భక్తులు తరలివస్తారని.. తెలిసినా ఆ దిశగా ఏర్పాట్లు సాగలేదు. శివ కేశవుల అభేధ క్షేత్రమైన పుష్పగిరిలో కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, లక్ష్మీచెన్నకేశవస్వామిలకు కలిపి తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు జరపడం ప్రత్యేకత. తొలుత పుష్పగిరి గ్రామంలోని వైద్యనాథేశ్వరుడికి, అనంతరం కొండపై చెన్నకేశవస్వామికి వాహన సేవ, ఇతర పూజలు జరుగుతాయి. ఈ వైభవాన్ని వీక్షించడానికి జిల్లా వాసులే గాక, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తారు. ఇంతటి ప్రాధాన్యం గల క్షేత్రంపై దేవాదాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మాజీ మంత్రి డీఎల్.రవీంద్రారెడ్డి వంశానికి చెందిన పూర్వీకులు పుష్పగిరి ఆలయ గాలిగోపుర దాతలుగా వున్నారు. దుగ్గిరెడ్డి వంశస్తులు వంశ పారంపర్య ధర్మకర్తలుగా ఉన్నారు. ఇప్పటి వరకూ దేవాదాయ శాఖతో కలిసి సమన్వయం చేసుకుంటూ ఏటా ఘనంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ భక్తుల మన్ననలు పొందారు.

ఇపుడే రాజకీయాలకు ప్రాధాన్యం

ఈ ఏడాది దేవాదాయ శాఖ అధికారులు బ్రహ్మోత్సవాల నిర్వహణ గాలికి వదిలేశారు. వంశ పారంపర్య ధర్మకర్తకు నామమాత్ర ప్రాధాన్యం ఇవ్వడమేగాక, రాజకీయాలకు ప్రాధాన్యమిస్తూ ఏకపక్ష నిర్ణయాలతో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గతంలో ప్రాధాన్యం ఉన్న బ్రహ్మోత్సవాలకు 15 నుంచి 20 రోజుల ముందే గోడ పత్రాలు, బ్యానర్లు, కరపత్రాలు, మీడియా ద్వారా ప్రచారం మిన్నంటేది. అయితే ఈ ఏడాది దేవాదాయ శాఖ అధికారులు బ్రహ్మోత్సవాల నిర్వహణను పట్టించుకోవడం లేదు. రాజకీయ అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రచారానికి స్వస్తి చెప్పారు. శుక్రవారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగ్గా కేవలం రెండు రోజుల ముందు మమ అనిపించేలా వాల్ పోస్టర్ల ఆవిష్కరణ చేశారని భక్తులు విమర్శిస్తున్నారు. శనివారం రెండు ఆలయాల్లో ధ్వజారోహణం కార్యక్రమాలు జరగాల్సి వుండగా, ఇప్పటికీ స్వామివార్ల వాహనసేవలు, ఇతర పూజా కార్యక్రమాలపై స్పష్టత లేదు. కరపత్రాలు అందుబాటులోకి రాలేదు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేయాలని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

పుష్పగిరి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

వల్లూరు : పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, లక్ష్మీచెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ చేశారు. స్వామికి ఉదయం పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, రక్షా బంధన కార్యక్రమాలు జరిపారు. కొండపై లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో అర్చకులు అఖిల్‌దీక్షితులు స్వామిని అభిషేకించారు. రాత్రి విశ్వక్సేన పూజతో కార్యక్రమాలు ప్రారంభించారు. పుట్ట వద్దకు వెళ్లి పవిత్రమైన మట్టి తీసుకువచ్చి భూదేవిగా అలంకరించి మేదినీ పూజ జరిపారు. నవధాన్యాలతో అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జైలుశిక్ష

బద్వేలు అర్బన్ : బద్వేలు అర్బన్ స్టేషన్ పరిధిలో జరిగిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నలుగురిని శుక్రవారం బద్వేల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ముకేష్ కుమార్ ఇద్దరికి రూ.10 వేల జరిమానా, మరో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు అర్బన్ సీఐ రాజగోపాల్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరు పరుస్తామని తెలిపారు.

కలిసి మెలిసి జీవిస్తేనే దేశాభివృద్ధి

- రాజ్యాంగం ప్రకారం ఏ మతమైనా స్వీకరించవచ్చు
- రౌండ్ టేబుల్ సమావేశంలో రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : దేశంలో ఎన్నో కులాలు, మతాలు ఉన్నాయని, అందరూ కలిసి మెలిసి జీవిస్తేనే దేశాభివృద్ధి జరుగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో దళిత ఫోరం చైర్మెన్ కిశోర్ బూసిపాటి ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో స్వతంత్రంగా జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. మతం ముసుగులో దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఏ మతమైనా ఆచరించే హక్కు ఉందని, బలవంతంగా ఎవరినీ మతం మార్చకూడదన్నారు. దాడులపై శాంతి కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. దళిత ఫోరం జిల్లా చైర్మెన్ కిశోర్ బూసిపాటి మాట్లాడుతూ మతం పేరుతో ఒకరిపై ఒకరు ద్వేషం పెంచుకోవడం సమాజానికి, దేశానికి మంచిది కాదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లవుతున్నా పిఠాపురంలో దళితులను గ్రామ బహిష్కరణ చేయడం దుర్మార్గమన్నారు. కమ్యునిస్టు నేత బి.నారాయణ మాట్లాడుతూ దేశంలో అంటరానితనం, వివక్ష ఉన్నప్పటికీ ఇటీవల ప్రభుత్వాలే దాడులకు పురికొల్పుతున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం దళితులు, క్రిష్టియన్ మైనార్టీలపై దాడులను సమైక్యంగా ఎదుర్కొందామని వక్తలు తీర్మానించారు. అందరూ జేఏసీగా ఏర్పడి దాడులను ఎదుర్కోవాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులిసునీల్, సీహెచ్.వినోద్, వేణుగోపాల్ నాయక్, చిన్నసుబ్బరాయుడు, బండిప్రసాద్, కె.బాబు, చిన్నయ్య, శ్యాంసన్, త్యాగరాజు, సంపత్, రత్నకుమారి, తులశమ్మ, సుశీలమ్మ, చైతల్య, మల్లీశ్వరి, పద్మ, వెంకటేశ్వర్లు, గుర్రప్ప, సీఆర్‌వీ.ప్రసాద్, జేవీ.రమణ, డా. పెంచలయ్య, 32మంది పాస్టర్లు పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని భారత్ పెట్రోలు బంకు సమీపంలో రెండు రోజుల కిందాట రమణయ్యపై కత్తితో దాడి చేసిన గుగ్గుటూరు సయ్యద్ దస్తగిరిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ తెలిపారు. కేసు వివరాలు శుక్రవారం ఆయన వెల్లడించారు. పట్టణంలోని కోటిరెడ్డినగర్‌కు చెందిన రమణయ్య కడపలోని సుందరయ్య కాలనీకి చెందిన లారీ ఓనర్ దస్తగిరి వద్ద డ్రైవర్‌గా చేస్తానని చెప్పి కొంత నగదును అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. అయితే డ్రైవర్‌గా వెళ్లకపోగా.. డబ్బు తిరిగి చెల్లించకుండా కాలయాపన చేస్తుండటంతో బుధవారం దస్తగిరి బద్వేల్‌కు వచ్చి రమణయ్యను నిలదీశాడు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో దస్తగిరి తన వద్ద ఉన్న కత్తితో రమణయ్యపై దాడి చేశాడు. అర్బన్ ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.